# కేసీఆర్ రాజన్నకే శఠగోపం పెట్టిండు

- గత ప్రభుత్వం ఆలయ అభివృద్ధిపై ఇచ్చిన మాట తప్పింది
- ఇచ్చిన మాట ప్రకారం వేములవాడను టెంపుల్ సిటీగా మార్చుతాం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజానావ, వేములవాడ:** గత ప్రభుత్వం రాజన్న ఆలయంతో పాటు వేములవాడ పట్టణ అభివృద్ధిపై ఇచ్చిన మాటను తప్పిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. అనాడు కేసీఆర్ రాజన్న ఆలయ మెట్ల మీద 'నా లగ్గం ఇక్కడే అయింది.. రాజన్న ఆలయ అభివృద్ధి చేస్తా'నని చెప్పిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజన్నకే శఠగోపం పెట్టాడని విమర్శించారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని 7,8,11,12 వార్డుల్లో పలు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల అభివృద్ధి పనులకు ఆది ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో రూ. 3కోట్ల పైచిలుకు నిధులతో 28 వార్డుల్లో ప్రజలు చెప్పిన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. 7,8,11,12 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని, ఇతర వార్డుల్లో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. వేములవాడ పట్టణంతో పాటు రాజన్న ఆలయ అభివృద్ధిని రెండు కళ్లలా చూస్తున్నామన్నారు. ఎన్నికల ముందు వేములవాడను టెంపుల్ సిటీగా మార్చుతామని చెప్పిన మాటకు కట్టుబడి ప్రణాళికలు రూపొందించుకుంటూ ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. గుడి చెరువు, మూలవాగులోకి వెళ్లే మురుగు నీటిని మళ్లించడానికి రూ. 9 కోట్లతో ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

### పదేళ్లయినా పనులు చేయలేదు

గత ప్రభుత్వం రంగురంగుల బ్రోచర్లలో మూడో బ్రిడ్జి నిర్మాణం, ఆలయ అభివృద్ధిని వీడియోల్లో చూపెట్టిందని, కానీ క్షేత్రస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. భూమి పూజ చేసి పదేళ్లయినా పనులు చేయలేదన్నారు. మేం భూమి పూజ చేసిన రోజు బ్రిడ్జి ఇరువైపులా నిర్వాసితులకు వచ్చి నష్ట పరిహారం ఇవ్వలేదని వాపోయారన్నారు. తమ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి నష్ట పరిహారం తీసుకొచ్చి కలెక్టర్ ఖాతాలో జమ చేశామన్నారు. వర్షాకాలంలో బ్రిడ్జి నిర్మాణం మొదలుపెడితే సాంకేతికంగా ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారని, గత ప్రభుత్వం పేడచెవిన పెట్టిన పనులను, పడావు పడగొట్టిన పనులను తమ ప్రభుత్వం చేస్తుందన్నారు.

### త్వరలోనే టెండర్ల ప్రక్రియ

రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.76 కోట్ల నిధులు కేటాయించి త్వరలోనే టెండర్ ప్రక్రియ పిలవనున్నట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధిపై ఇప్పటికే నాలుగు సార్లు శృంగేరి వెళ్లి పీఠాధిపతి అనుమతి తీసుకొని రావడం జరిగిందని గుర్తుచేశారు. పట్టణ ప్రముఖులు, పరిరక్షణ సమితి సభ్యులు అందరి సలహాలు, సూచనలు తీసుకొని అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. కొందరు మాట్లాడుతూ నిధులు ఎక్కడివని అడుగుతున్నారని, ఇప్పటికే 2024 బడ్జెట్‌లో రూ.50 కోట్లు, 2025-26 బడ్జెట్‌లో రూ.100 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం జరిగింని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నిధులు కేటాయించినట్లు చెప్పారు. మన ప్రాంతానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయడం జరిగిందన్నారు. గెలిచిన మొదటి 10 నెలల్లో సుమారు రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు చేశామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఈ ప్రాంత ప్రజల ఆలోచనలకు అనుగుణంగా వేములవాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ కనికరపు రాకేశ్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శివంగలపల్లి గ్రామానికి చెందిన దూదేకుల దరియా అనారోగ్య కారణాలతో చికిత్స తీసుకోగా, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 1.50 లక్షల చెక్కును మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం




**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామం మూడో అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్ శారద ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. తమ కేంద్రంలో క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్నామని, పిల్లల ఎదుగుదలకు ఇది ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా అంజవ్వ, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చింతల జన్మదిన వేడుకలు



**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా కార్యకర్తలు, నాయకులు అభిమానులు మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ మహనీయుల విగ్రహాల వద్ద పెద్దసంఖ్యలో పాల్గొని వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అంతకుముందు వినాయక్ నగర్‌లో కొలువున్న ఎల్లమ్మ ఈదమ్మ ఆలయంలో స్థానిక బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో చింతల రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఇందిరానగర్‌లో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో రామకృష్ణ స్టేజ్ వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ మెంబర్ కాడిగారి భోజి రెడ్డి, ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం వెంకట్ స్వామి, జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త నీరజ, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వల్లేపు శంకర్, కౌన్సిల్ మెంబర్ సీతల అనిల్ కుమార్ తో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అన్నం పెట్టమంటే.. కోడలు చెప్పుతో కొడుతుంది

### కలెక్టరేట్‌లో వృద్ధ దంపతుల ఫిర్యాదు

**ప్రజానావ, వరంగల్:** అన్నం పెట్టమంటే కోడలు చెప్పుతో కొడుతుందని కలెక్టరేట్‌లో వృద్ధ దంపతులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. హన్మకొండ జిల్లా పరకాల మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన కొమురమ్మ, సమ్మయ్య అనే వృద్ధ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. ఆస్తి పంచిన తర్వాత తమకు అన్నం పెట్టడం లేదని, అన్నం పెట్టమంటే కోడలు చెప్పుతో కొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను పట్టించుకోని వారికి ఆస్తి ఎందుకు ఇవ్వాలని, తమ ఆస్తి తమకు ఇప్పించాలని ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.






# మంత్రి పదవికి సమయం ఉంది

- కాంగ్రెస్‌లో పనిచేసిన వారికే పదవులు
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

**ప్రజానావ, ఖైరతాబాద్:** కాంగ్రెస్ పార్టీలో హామీలు ఉండవని, పనిచేసే వారికే పదవులు దక్కుతాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. హిమాయత్‌నగర్ లో రూ.60 లక్షలతో రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆదర్శ నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో 150 మందికి కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. సామాజిక న్యాయం పాటిస్తూ సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గ విస్తరణ చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎస్సీ, బీసీలకు ప్రాధాన్యం కల్పించారన్నారు. రాహుల్‌గాంధీ ఆశయాలను రేవంత్ ముందుకు తీసుకెళున్నారని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ నుంచి మంత్రి పదవి వస్తుందా అన్న ప్రశ్నకు ఇంకా సమయం ఉందని, వేచి ఉండాలని సూచించారు. నూతన మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన వారికి ఈ సందర్భంగా దానం అభినందనలు తెలిపారు.

# ఆగమశాస్త్రం ప్రకారమే ఆలయ అభివృద్ధి జరగాలి

- విస్తరణలో హిందూ సంఘాలను భాగస్వామ్యం చేయాలి
- ఉమ్మడి తెలుగు రాష్ట్రాల హిందూ ఐక్యవేదిక

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను ఆగమశాస్త్రం ప్రకారం చేయాలని హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం వేములవాడ పట్టణంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మ రక్షణ, దేవాలయాల సంరక్షణ ధ్యేయంగా హిందూ సంఘాలు ముందుకు వెళ్తున్నాయని, వేములవాడ ఆలయ అభివృద్ధిలో ఇదివరకు ఎలాంటి ప్లానింగ్ విడుదల చేయలేదన్నారు. ఆలయ అభివృద్ధి విస్తరణలో ఇండ్లతో పాటు దుకాణాలు కోల్పోతున్న వారికి ఎలాంటి పరిహారం ఇస్తారో చెప్పకుండా అభివృద్ధి పని చేస్తామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఆలయ అభివృద్ధి విస్తరణ నేపథ్యంలో హిందూ సంఘాలను భాగస్వామ్యం చేయకపోవడం అనుమానాల కు తావిస్తుందన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన పనుల నేపథ్యంలో కాంట్రాక్టు హిందువులకు సంబంధించిన వారికే ఇవ్వాలని.. అన్యమతస్తులకు ఇస్తే ఊరుకోమంటూ హెచ్చరించారు.

# టీఆర్టీఎఫ్ బడిబాట ర్యాలీ

**ప్రజానావ, సిరిసిల్ల:** తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ టీఆర్టీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రొ. జయశంకర్ బడిబాట బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ టీఆర్టీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, బోయన్నగారి నారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పాఠశాల్లో కంప్యూటర్ విద్య, ఏఐ ఆధారిత విద్య, డిజిటల్ విద్యను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అందిస్తుందన్నారు. 'మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపండి.. తరగతి గది సామర్థ్యాన్ని విద్యా హామీగా మేం ఇస్తున్నాం' అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని, అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తున్నందున వాటిని ఉపయోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఒత్తిడి లేని విద్య, పౌష్టికాహారం ప్రభుత్వ పాఠశాలలతోనే సాకారం అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర టీచర్ పక్షాన రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను చైతన్య పరచడం ద్వారా, ప్రభుత్వ విద్యను వారికి అందుబాటులో తెచ్చేందుకు, ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు, ప్రభుత్వ బడులను సమాజానికి దగ్గర చేసేందుకు, పాఠశాలల్లోని వివిధ కార్యక్రమాల్లో సమాజాన్ని అనుసంధానం చేయడమే లక్ష్యంగా ఈ బడిబాట విద్య ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ బైక్ ర్యాలీ జిల్లా పరిషత్ బాయ్స్ హై స్కూల్ నుంచి బయల్దేరి కొత్త బస్టాండ్ తెలంగాణ తల్లి విగ్రహం నుంచి నేతన్న విగ్రహం ద్వారా.. అంబేద్కర్ విగ్రహం నుండి గాంధీ చౌరస్తా వరకు సాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, రాష్ట్ర మెంబర్‌షిప్ కన్వీనర్ సుంకిశీల ప్రభాకర్ రావు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ , రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షులు మోతీలాల్, టీఆర్టీఎఫ్ నాయకులతో పాటు ప్రధానోపాధ్యాయులు బాల ఎల్లయ్య, కొమురయ్య, సుల్తాన్ రాజు, బూట్ల శ్రీనివాస్, జె శ్రీనివాస్ రావు, మామిడాల రమేశ్ పాల్గొన్నారు. అంతకుముందు వీరంతా బైక్ ర్యాలీ తీశారు.



